క్లుప్తంగా

విద్యార్థులకు బెల్టుల ప్రదానం

అయిజ: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో తైక్వాండోలో శిక్షణ పొందిన విద్యార్థులకు ఆదివారం మాస్టర్లు బెల్టులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర తైక్వాండో జనరల్ సెక్రటరీ మాస్టర్ శ్రీహరి, జిల్లా తైక్వాండో ప్రెసిడెంట్ షేక్షావలి ఆచారి, శిక్షకులు సుధీర్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



ధరూరు: జూలై నెల మొదటి ఆదివారాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఎంబీ షాలేము చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ రవికుమార్ బైబిల్ ప్రవచనాలు బోధించారు. సమాజంలో యువత అనేక రుగ్మతలకు లోనవుతోందని, సన్మార్గంలో నడవాలని సూచించారు. సంఘానికి, సమాజానికి కట్టుబడి జీవించాలన్నారు. అనంతరం బల్లారాధన కార్యక్రమం నిర్వహించి సామూహిక భోజనాలు చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో బోనాల వేడుకలు



గద్వాలటౌన్: జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బోనాల వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సత్యసాయి విద్యా మందిర్ పాఠశాలలో విద్యార్థులు బోనం ఎత్తుకొని సంప్రదాయ నృత్యాలు చేశారు. బోనాలతో పాఠశాల నుంచి స్థానిక సుంకులమ్మ దేవాలయం వరకు వెళ్లి పూజలు చేశారు.

క్రీడాకారులకు అండగా ఉంటాం



ఆత్మకూర్: రాష్ట్రంలో క్రీడాకారులకు అండగా నిలుస్తామని గ్రామీణ ప్రాంత క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా ప్రోత్సహిస్తున్నామని రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో అంతర్జాతీయ గోల్‌బాల్ పోటీలకు ఎంపికైన ఆత్మకూర్‌కు చెందిన సమ్మిళిత ఫౌండేషన్ విద్యార్థి పవన్‌కల్యాణ్, భారత జట్టు కోచ్‌గా ఎంపికైన సంస్థ డైరెక్టర్ గాండ్ల శివకుమార్‌ను రాష్ట్ర స్పోర్ట్స్ డైరెక్టర్ సోనిబాలాదేవితో కలిసి సన్మానించారు. ఈజిప్ట్ దేశంలో సెప్టెంబర్ మొదటివారంలో జరిగే గోల్‌బాల్ క్రీడలకు ఎంపికవడం అభినందనీయమన్నారు. క్రీడాకారులకు అన్నివిధాలుగా అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం తరఫున సహకారాలు అందిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రహ్మతుల్లా, కోచ్‌లు ఖాదర్, అరుణ్, కిషోర్, దివాకర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాలి

అమరచింత: స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ పంచాయతీలతో పాటు మున్సిపాలిటీలను కైవసం చేసుకునే విధంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సంఘటితంగా శ్రమించాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర నాయకుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన మండలస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంత్‌రెడ్డికి డాక్టరేట్ వచ్చినందును ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. పీఎం నరేంద్రమోదీ అందిస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యం ఏ మాత్రం లేదని అది కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న బియ్యమేననే విషయాన్ని ప్రతి పల్లెకు చేరేలా వివరించాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందించింది ఏ మాత్రం లేదన్నారు. ప్రధాని ఆవాస్‌యోజన్ ద్వారా ఇస్తున్న ఇండ్లనే ఇక్కడ ఇందిరమ్మ ఇండ్లు అని ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను తెలియ పరుస్తున్నదన్నారు. బీజేపీ మండల అధ్యక్షురాలు మంగలావణ్య, నాయకులు మేర్వరాజు, నారాయణ, ఆశోక్, మల్లారెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు

రాజోళి: మండల కేంద్రం రాజోళితో పాటు ఆయా గ్రామాల్లో ఆదివారం ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. తుంగభద్ర నదిలో పుణ్యస్నానమాచరించిన భక్తులు రామలింగేశ్వరస్వామి ఆలయం, వైకుంఠ నారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు స్వామివార్లను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

అయిజ: తొలి ఏకాదశిని పురస్కరించుకొని మండల కేంద్రం, వివిధ గ్రామాల్లోన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఏకాదశి మొక్కులు చెల్లించారు.

విరాళం అందజేత

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం గ్రామంలో కొండపై వెలసిన పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పాతపాలెం గ్రామానికి చెందిన శ్యామ్‌రెడ్డి దంపతులు రూ.50 వేలు విరాళం అందజేశారు. ఆలయ సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలకు తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో సన్మానించారు.

బీచుపల్లిలో ప్రత్యేక పూజలు

ఎర్రవల్లి: తొలి ఏకాదశిని పురస్కరించుకొని బీచుపల్లి పుణ్యక్షేత్రంలో ఆకుపూజ, అభిషేకం, కుంకుమార్చన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో బీచుపల్లికి చేరుకొని పవిత్ర కృష్ణానదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం శివాలయం, కోదండరామస్వామి, సరస్వతీ దేవి ఆలయాలతో పాటు అభయాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



ఉత్తనూరులోని ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో విరాళం అందజేస్తున్న భక్తులు



రాజోళిలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు

ఘనంగా మొహర్రం పండుగ



అయిజలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు



ఉండవెల్లిలో పీర్ల నిమర్జనంలో పాల్గొన్న ప్రజలు

గద్వాల/గట్టు/ఉండవెల్లి/అయిజ/ఎర్రవల్లి : గట్టు మండలంలో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రం కమ్మరి వీధిలోని మసీదు నుంచి పీర్లను ఊరేగించారు. హిందూ, ముస్లింలు మతసామరస్యంతో పీర్ల ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహబూబ్‌పాషా, అబ్దుల్‌వాహబ్, నన్నేసాబ్, జాఫర్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

❖ ఉండవెల్లి మండల పరిధిలో మోహర్రం సందర్భంగా పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. మండల కేంద్రంలో గుక్కిపిండిని పీర్లకు చల్లుతూ నిమర్జన వేడుకలు కుల మత భేదాలు నిర్వహించారు.

❖ అయిజ మండల కేంద్రంలో మొహర్రం వేడుకలు కులమతాలకు అతీతంగా నిర్వహించారు. దర్గాలు, మసీదుల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పీర్లను ఊరేగించి నిమర్జనం చేశారు.

❖ కేటీదొడ్డి మండలంలో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని పాతపాలెం, నందిన్నె, ఇర్కిచేడు, చింతలకుంట గ్రామాల్లో పీర్లకు ప్రత్యేకంగా అలంకరణ చేసి ఊరేగించారు. నిమర్జన ఊరేగింపులో హిందువులు ముస్లింలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

❖ ఉమ్మడి ఇటిక్యాల మండలంలో మొహర్రం వేడుకలు మతసామరస్యానికి ప్రతీకగా జరుపుకున్నారు. గార్లపాడు గ్రామంలోని మద్దెలబండ ఉశేన్ షాబ్ పీరును చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. దట్టీలు, ముడుపులను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి పానకం దుత్తలను అలాయి గుంతముందు ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పీర్ల ఊరేగింపు, నిమర్జన కార్యక్రమం నిర్వహించారు.



గట్టులో పీర్ల ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



గార్లపాడుతో పీర్లను దర్శించుకొంటున్న భక్తులు

నాయకులకు ఘన నివాళి



గద్వాలలో శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రాపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గద్వాలటౌన్: జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయమని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బండల వెంకట్రాములు, పట్టణ అధ్యక్షురాలు జయశ్రీ అన్నారు. ఆదివారం స్థానిక డీకే బంగ్లాలోని పార్టీ కార్యాలయంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం గర్వించదగిన నేతల్లో ముఖర్జీ ఒకరని కొనియాడారు. ఆయన ముఖర్జీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రజక నర్సింహ, చిత్తారి కిరణ్, దేవదాసు, అనిల్, కృష్ణ, పాండు, మోహన్‌రెడ్డి, వాసు, అశోక్, నర్సింహగౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



అయిజలో జగ్జీవన్‌రాం నివాళులర్పిస్తున్న నాయకులు

జగ్జీవన్‌రాంకు నివాళి

అయిజ: స్వాతంత్ర్య సమరయోధుడు, దివంగత మాజీ ఉప ప్రధాని బాబుజగ్జీవన్‌రాం వర్ధంతిని మండల కేంద్రంలో అంబేడ్కర్ ఉత్సవ కమిటీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లోకరాజు, లెనిన్ బాబు, నరేంద్రవర్మ, సుబ్బన్న, మాదన్న పాల్గొన్నారు.

ఎర్రవల్లి: మండల పరిధిలోని కోదండాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రాం వర్ధంతిని నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ జగ్జీవన్‌రాం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నర్సిరెడ్డి, బాబు, లింగరాజు, గిరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



ధరూరు: మండల పరిధిలోని ద్యాగదొడ్డి గ్రామంలో నివాస గృహాలపై విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి, విద్యుత్ శాఖ లైన్‌మెన్‌కు సమాచారం అందించినా ఫలితం లేకపోయిందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ తీగలు చెట్టుకు ఆనుకొని ఉండడంతో ఎర్త్ వస్తోందని తెలిపారు. ప్రమాదం జరుగకముందే ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

భగవద్గీతపై ప్రచారం

కొత్తకోట రూరల్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక కొత్తకోట, వనపర్తి మండలాల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో త్రైత సిద్ధాంత గ్రంథాలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణుడే జగద్గురువని, కృష్ణుడి బోధనలు ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు ఎం.వెంకట్రాములు, పురుషోత్తం, మాసన్న, వేణుగోపాల్, బాలకృష్ణ, శివ, ఎం.పద్మ, సి.కృష్ణయ్య, నాగరత్నం, లలిత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల మైదానానికి మరమ్మతు



ప్రభుత్వ పాఠశాల మైదానంలో మట్టి వేయిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అయిజ: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో పడిన గుంతలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం ఎర్రమట్టితో పూడ్చివేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. పాఠశాల మైదానంలో వర్షం నీరు నిలిచి విద్యార్థులు, ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులకు గురవుతుండడంతో గతంలో మున్సిపల్ కౌన్సిల్ తీర్మానంలో మరమ్మతు కోసం రూ. లక్ష కేటాయించినట్లు తెలిపారు. అదే విధంగా పర్దిపురం- జడుదొడ్డి రోడ్డుపై పడిన గుంతలను కూడా మట్టితో పూడ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మణుమన్న, జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పాండురంగ, పట్టణ ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, మధుకుమార్, సులోచనమ్మ , రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

గట్టు: ఆవాజ్ కమిటీ రాష్ట్ర 3వ మహా సభలను జయప్రదం చేయాలని కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతికూర్ రహమాన్, బీఆర్‌ఎస్ నేత నాగర్‌దొడ్డి వెంకట్రాములు కోరారు. ఆదివారం గట్టు, మాచర్ల గ్రామాల్లో అవాజ్ కమిటీ సభ్యులు పర్యటించారు. గద్వాలలో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్న మహా సభలను విజయవంతం చేయాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో గౌస్, మహ్మద్‌అలీ, హనీఫ్, తాహిర్, షేక్షావలి, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, రఫీ తదితరులు పాల్గొన్నారు.



మాచర్లలో నిర్వహించిన సమావేశంలో అవాజ్ కమిటీ సభ్యులు

కూడలిలో డ్రెయినేజీ అస్తవ్యస్తం



అలంపూర్ చౌరస్తాలో రోడ్డుపై పారుతున్న వరద



దుకాణాల ఎదుట నిలిచిన వర్షపు నీరు

- రోడ్లపైనే పారుతున్న వర్షపు నీరు, మురుగు
- ప్రజలు, దుకాణదారులకు తప్పని ఇక్కట్లు

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని నాలుగు రోడ్ల కూడలిలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. డ్రెయినేజీ లేక వర్షం కురిసిన ప్రతిసారి వర్షపునీరు, మురుగు రోడ్డుపై నిలిచి అవస్థలు పడుతున్నట్లు దుకాణదారులు వాపోతున్నారు. ప్రధానంగా అలంపూర్ రోడ్డు మార్గంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. అలంపూర్ క్షేత్రానికి ప్రధాన రహదారి కావడంతో భక్తులు, పర్యాటకుల సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. వీటితోపాటు అలంపూర్, ఉండవెల్లిలోని దాదపు 30 గ్రామాలకు పైగా ప్రజలు ఇదే మార్గంలో ప్రయాణాలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

గుంతలు పూడ్చండి సారూ..



చెన్నిపాడులో రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నిలిచిన వర్షపు నీరు



ప్రమాదకరంగా మానవపాడు నుంచి జాతీయ రహదారికి వెళ్లే రోడ్డు

మానవపాడు: గుంతలతో రోడ్లతో తీవ్ర అవస్థలు పడుతున్నట్లు మండలంలోని చెన్నిపాడు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలతో రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై గుంతలు పూడ్చాలని కోరుతున్నారు.

ప్రమాదం సార్... పట్టించుకోండి

మానవపాడు మండల కేంద్రం నుంచి జాతీయ రహదారికి వెళ్లే ప్రధాన రహదారిపై జూరాల కాల్వ వద్ద మలుపు ప్రమాదకరంగా ఉందని వాహనదారులు పేర్కొంటున్నారు. మలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు మలుపులో అదుపుతప్పి కాల్వలో పడిన సందర్భాలు ఉన్నట్లు పేర్కొన్నారు. అధికారులు స్పందించి మలుపుల వద్ద రక్షణ గోడ నిర్మించాలని, అదే విధంగా సూచికలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డుపైనే పారుతున్న మురుగు

గట్టు: ప్రధాన రహదారిని సీసీరోడ్డుగా మార్చినా ఆ ఊరి ప్రజలు మాత్రం మురుగును రోడ్డుపై వదలడం మానలేదు. ఫలితంగా మురుగు నీటిలోనే ప్రయాణం చేయాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. గట్టు నుంచి గొర్లఖాన్‌దొడ్డి గ్రామంలోకి వచ్చే ప్రధాన రహదారిని ఇటీవల సీసీరోడ్డుగా మార్చారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వరకు మురుగును రోడ్డుపైకే వదులుతున్నారు. గట్టు నుంచి గొర్లఖాన్‌దొడ్డి, ఆరగిద్ద, తప్పెట్లమొర్సు, అయిజకు వెళ్లే వాహనదారులు ఈ రోడ్డుపైనే ప్రయాణా చేయాల్సి ఉంటుంది. దీంతో మురుగుతో నానా అవస్థలు పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. అధికారులు ఇదే రోడ్డుపై ప్రయాణిస్తున్నా చర్యలు మాత్రం చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు.

పట్టణంలో ట్రాఫిక్ తిప్పలు



అయిజలో రోడ్డుకు అడ్డుగా నిలిచిన లారీలు

అయిజ: పట్టణంలో ట్రాఫిక్ జాం సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు మున్సిపాలిటీ ప్రజలు వాపోతున్నారు. వివిధ రకాల వ్యాపారాలకు సంబంధించిన సరుకులు లోడింగ్ అన్‌లోడింగ్‌కు వాహనాల గంటల తరబడి ప్రధాన రోడ్లపై నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. అదే విధంగా రోడ్ల వెంట చిరు వ్యాపారులు క్రయ విక్రయాలు సాగిస్తుండటంతో వెళ్లేందుకు స్థలం లేకపోవడంతో వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. ఏళ్ల తరబడి ట్రాఫిక్ సమస్య వేధిస్తున్న పట్టించుకునే నాథుడే లేరని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ.5 వేల వరకు అద్దె వసూలు

పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ వరకు ప్రధాన రహదారికి ఇరు వైపులా దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. వ్యాపార దుకాణం ముందు ఉన్న ఖాళీ స్థలంలో చిరు వ్యాపారులు విక్రయాలు జరుపుతుంటారు. వారికి అద్దెగా నెలకు రూ.3 వేల నుంచి రూ. 5 వేల వరకు వసూలు చేస్తున్నారు. దీంతో చిరు వ్యాపారులు రోడ్డుపై శాశ్వతంగా వ్యాపార అడ్డాలను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది.

మార్కెట్ అందుబాటులో లేక

మున్సిపాలిటీలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన నిర్మాణం పూర్తయి మూడు సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటి వరకు వినియోగంలోకి తీసుకరాకపోవడంతో పూలు, పండ్లు, కూరగాయలు వ్యాపారులు ప్రధాన రోడ్డు వెంట విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. తరుచూ ట్రాఫిక్ జాం కావడంతో ఇబ్బందులు పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. ముఖ్యంగా అంబులెన్స్ వంటి అత్యవసర వాహనాలు వెళ్లేటపుడు ట్రాఫిక్ జాం కావడంతో వైద్యం అందక కొందరు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూస్తాం



పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూస్తాం. ఇటీవల వ్యాపార దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించాం. రాత్రి 9 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు మాత్రమే లోడింగ్, అన్ లోడింగ్ చేయించాలని ఆదేశించాం. చిరు వ్యాపారులు కూడా రోడ్లపై విక్రయాలు నిర్వహించకుండా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసరావు, ఎస్‌ఐ, అయిజ

రోడ్లపై విక్రయాలు నిషేధించాలి



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పూర్తయినా సరే అందుబాటులో లేక చిరు వ్యాపారులు ప్రధాన రోడ్డు పక్కన క్రయవిక్రయాలు జరుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. రోడ్డు పక్కన వాహనాలు నిలిపివేయడంతో రోడ్డు మొత్తం బ్లాక్ అవుతుంది. రోడ్లపై క్రయవిక్రయాలు జరుపకుండా చర్యలు తీసుకోవాలి.

– నజీర్, అయిజ

అంబులెన్స్‌లకు ఇబ్బంది



అత్యవసర వైద్య సేవలందించాల్సిన వారిని అంబులెన్స్ వాహనంలో వేగంగా తీసుకెళ్లాల్సి ఉంటుంది. పట్టణంలో ఏర్పడే ట్రాఫిక్‌జాం వలన అత్యవసర సమయానికి రోగులు, క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకెళ్లలేని పరిస్థితి ఉంది. ప్రధాన రోడ్లపై ట్రాఫిక్ జాం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– శ్రీధర్, 108 సిబ్బంది, అయిజ